ఆడపిల్లలకు బంగారు భవిష్యత్

- సుకన్య సమృద్ధి యోజనకు విశేష ఆదరణ
- పదేళ్ల లోపు బాలికలు అర్హులు
- పోస్టల్ శాఖ విస్తృత ప్రచారం



చింతలూరు పోస్టాఫీసు

అలమూరు: కేంద్ర ప్రభుత్వం పదేళ్ల బాలికల కోసం పోస్టల్‌శాఖ ద్వారా బేటీ బచావో.. బేటీ పడావో (ఆడపిల్లను రక్షించు.. ఆడపిల్లను చదివించు) సుకన్య సమృద్ధి యోజన (ఎస్‌ఎస్‌వై) పథకానికి అన్ని చోట్ల విశేష ఆదరణ లభిస్తుంది. ఈ పథకం బాలికల అభ్యున్నతికి, బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తుంది. ఆడపిల్లల ఆర్థిక భద్రత లక్ష్యంగా ప్రవేశపెట్టిన ఎస్‌ఎస్‌వై పట్ల పోస్టల్ శాఖ విస్తృత ప్రచారం చేయడంతో ఆడపిల్లల తల్లిదండ్రులు అమితంగా ఆకర్షితులై తమ ఆడపిల్లలకు పోస్టల్ ఖాతాను తెరుస్తున్నారు. అలాగే ఈ పథకంపై అవగాహన కోసం స్థానిక గ్రామ సచివాలయల పరిధిలో పోస్టల్ శాఖ గ్రామీణ ప్రాంతాల్లో విరివిగా అవగాహన సదస్సులు నిర్వహిస్తోంది. అమలాపురం డివిజన్ పరిధిలోని కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల్లో హెడ్ పోస్టాఫీసులు 04, సబ్ పోస్టాఫీసులు 52 ఉండగా ఇప్పటి వరకూ సుకన్య పథకం కింద దాదాపు 18 వేల ఖాతాలు ఉండటం పరిస్థితికి అద్దం పడుతుంది. ఈ ఏడాదిలో ఇప్పటి వరకూ సుమారు 380 మంది బాలికలు సుకన్య సమృద్ధి యోజన ఖాతాలను ప్రారంభించినట్లు పోస్టల్ శాఖ చెబుతుంది. ఎస్‌ఎస్‌వై ఖాతా కాలపరిమితి పూర్తయిన 21 ఏళ్ల తర్వాత చేతికి ఆ పొదుపు సొమ్ము లభిస్తుంది. పదోతరగతి తర్వాత ఉన్నత విద్యకోసం, 18 ఏళ్ల నిండిన తర్వాత ఖాతాలోని 50 శాతం మొత్తాన్ని రుణంగా పొందే వీలుంటుంది.

పన్ను రాయితీలు.. ఆన్‌లైన్ ద్వారా చెల్లింపులు

పోస్టల్ శాఖలో ఖాతాను ప్రారంభించిన తరువాత 21 ఏళ్ల కాల పరిమితి తీరే వరకూ నిల్వ ఉన్న సొమ్ముకు వడ్డీ లభిస్తుంది. ఉదాహరణకు రెండు సంవత్సరాల బాలికకు సుకన్య సమృద్ధి అకౌంట్‌లో నెలకు రూ.1000 చొప్పున 15 సంవత్సరాలకు రూ.1.8 లక్షలు పొదుపు అవుతుంది. తర్వాత ఆరు సంవత్సరాలకు కాలపరిమితి పూర్తయిన 21 ఏళ్లకు 7.6 శాతం వడ్డీతో దాదాపు రూ.5.3 లక్షలు తల్లిదండ్రుల చేతికి వస్తుంది. ఈ పథకంలో నిల్వ చేసే సొమ్ముకు, వడ్డీకి పన్ను రాయితీ లభిస్తుంది. పోస్టాఫీసుకు రాలేని వారు ఖాతా ప్రారంభించిన తరువాత ఐపీపీబీ ద్వారా ఆన్‌లైన్ చెల్లింపులు చేసుకోవచ్చు. ఆడపిల్లల భవిష్యత్‌కు కొండంత అండగా ఈసుకన్య సమృద్ధి యోజన పథకం ఉందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతుంది.

ఎస్‌ఎస్‌వై ప్రయోజనాలు

- పదేళ్ల లోపు ఆడపిల్లలు కలిగిన తల్లిదండ్రులు లేదా సంరక్షకులు రూ.250 చెల్లించి పోస్టల్ ఖాతాను ప్రారంభించవచ్చు.
- కుటుంబానికి ఇద్దరు ఆడపిల్లలు మాత్రమే అర్హులు.
- ఖాతా కాలపరిమితి 21 సంవత్సరాలు.
- ఏడాదిలో గరిష్ఠంగా రూ.1.5 లక్షల వరకు పొదుపు చేసుకోవచ్చు.
- ఎస్‌ఎస్‌వై పథకం కింద ఖాతా ఉన్న వారికి వార్షిక చక్రవడ్డీ లభిస్తుంది.
- ఖాతా తెరిచిన నాటి నుంచి 15 ఏళ్ల వరకు మాత్రమే పొదుపును చెల్లించాలి.
- మైనార్టీ తీరాక వివాహం కోసం అకౌంట్‌ను క్లోజ్ చేసుకోవచ్చు.

అకౌంట్ తెరిచేందుకు కావాల్సినవి

- బాలిక పుట్టినతేదీ ధ్రువీకరణ పత్రం
- తల్లి లేదా తండ్రి ఆధార్, పాన్‌కార్డు జెరాక్స్‌లు
- తల్లీ లేదా తండ్రి యొక్క రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు

ఎస్‌ఎస్‌వై పథకంపై అవగాహన పెంచుతున్నాం



చింతలూరు పోస్టాఫీసు పరిధిలో 2200 వరకు ఎస్‌ఎస్‌ఏ అకౌంట్లు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో తరచూ నిర్వహిస్తున్న అవగాహన సదస్సులకు మెరుగైన స్పందన వస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో 1586 ఖాతాలు ప్రారంభిస్తే ఈ ఏడాదిలో ఇప్పటి వరకూ దాదాపు 210 ఖాతాలు ప్రారంభించాం.

– టి.సూర్యనారాయణరెడ్డి, పోస్టుమాస్టర్, చింతలూరు.

ఆడపిల్లల భవిష్యత్‌కు ఉపయోగపడుతుందనే..



పోస్టల్ శాఖ ప్రవేశపెట్టిన అత్యుత్తమ పథకాల్లో ఎస్‌ఎస్‌వై పథకం ఆడపిల్లలకు ప్రయోజనం. ఆడపిల్లలకు ఆర్థిక భరోసా కోసం కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ స్కీమును అమలు చేస్తోంది. ఈపథకాన్ని తమ లాంటి తల్లి దండ్రులు సద్వినియోగం చేసుకుంటూ ఆడపిల్లల బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకుంటున్నాం.

– వి.లక్ష్మీశిరీష, సంధిపూడి.

క్లుప్తంగా

రేపు జగ్గిరెడ్డి నామినేషన్



కొత్తపేటలో విలేకరులతో మాట్లాడుతున్న డేవిడ్‌రాజు, మార్గన తదితరులు

కొత్తపేట: స్థానిక ఎమ్మెల్యే, అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి చిర్ల జగ్గిరెడ్డి ఈ నెల 22 న (సోమవారం) నామినేషన్ దాఖలు చేస్తారని అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌రాజు తెలిపారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, సర్పంచ్ రెడ్డి చంటి, మండల సేవాదళ్ అధ్యక్షుడు గూడపాటి ప్రవీణ్‌కుమార్ తదితరులు ఎమ్మెల్యే జగ్గిరెడ్డి నామినేషన్ ఏర్పాట్లపై చర్చించారు. వారు విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలోని నాలుగు మండలాల నుంచి అందరూ ఉదయం 9.30 గంటలకు రావులపాలెం పార్టీ కార్యాలయం వద్దకు చేరుకోవాలని సూచించారు.

నిత్యాన్నదానానికి విరాళం



దాత రంగనాగ్‌కు స్వామి చిత్రపటం అందజేస్తున్న ఆలయ సిబ్బంది

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి అమలాపురానికి చెందిన నిమ్మకాయల రంగనాగ్ శనివారం రూ.10,116 విరాళం అందజేశారు. ఈ సొమ్ము ఆలయ జూనియర్ అసిస్టెంట్ జగతా చిట్టిబాబుకు అందజేశారు. దాతను పలువురు అభినందించారు. దాతకు చిట్టిబాబు స్వామివారి చిత్రపటం ప్రసాదం అందజేశారు.

జనసేనకు గొల్లపాలెం టీడీపీ గ్రామ శాఖ అల్టిమేటం

మలికిపురం: రాజోలు జనసేన అభ్యర్థి దేవ వరప్రసాద్‌కు మలికిపురం మండలంలోని గొల్లపాలెం గ్రామ టీడీపీ అల్టిమేటం ఇచ్చింది. ఇటీవల గ్రామంలో టీడీపీ నేతలను వైఎస్సార్ సీపీ కార్యకర్తలుగా చూపించి జనసేనలో చేర్చినట్లు వార్తలు రావడంతో పాటు జనసేనలో చేరిన గ్రామ వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ముగ్గురు తిరిగి వైఎస్సార్ సీపీలో చేరిన సంఘటనపై గ్రామ టీడీపీకి వివరణ ఇచ్చే వరకూ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని నిర్ణయించినట్లు గ్రామ శాఖ టీడీపీ సోషల్ మీడియా వేదికగా ప్రకటించింది.

వైభవంగా సత్యలింగేశ్వరుని కల్యాణం



సత్యలింగేశ్వరునికి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మామిడికుదురు: పెదపట్నంలంకలో కొలువుదీరిన ఉమా సత్యలింగేశ్వరస్వామి కల్యాణం శుక్రవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. మేళతాళాలు, సన్నాయి వాయిద్యాలు, భక్తుల కోలాహలం నడుమ సత్యలింగేశ్వరుని కల్యాణం ఆద్యంతం కమనీయంగా నిర్వహించారు. పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన మంటపంలో ఉమాదేవితో సత్యలింగేశ్వరుని కొలువుదీర్చారు. బ్రహ్మశ్రీ ఆదిరాజు రఘునాథశర్మ, సూర్యకుమారి దంపతులు కర్తలుగా పాల్గొని సత్యలింగేశ్వరుని కల్యాణ ఘట్టాన్ని జరిపించారు. బి.దొడ్డవరంలో వేంచేసిన ఉమా సోమేశ్వరస్వామి కల్యాణం కూడా రమణీయంగా జరిగింది. ఆయా కల్యాణోత్సవాల్లో భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్ల తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా లక్ష్మీగణపతి విగ్రహ ప్రతిష్ఠాపన



లక్ష్మీగణపతి విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

అలమూరు: గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన శ్రీలక్ష్మీ గణపతి ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా ప్రారంభమైంది. వేద పండితులు కాళ్లకూరి దుర్గాప్రసాద్ శర్మ, వెలవలపల్లి చైతన్యకృష్ణ నేతృత్వంలోని పురోహితుల బృందం ఈ పూజలను చేపట్టింది. ఈనెల 22న ఉదయం 10.49 గంటలకు విగ్రహ ప్రతిష్ఠ జరుగుతుందని ఆలయ కమిటీ తెలియజేసింది. ప్రతిష్ఠాపన పూజల్లో భాగంగా శనివారం యంత్ర ప్రతిష్ఠ, బింబశిఖర ధ్వజ ప్రతిష్ఠ, గణపతి హోమం నిర్వహించారు.

రేపు నామినేషన్‌కు తరలిరావాలి



జి.అగ్రహారంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న పరిశీలకుడు శ్రీనివాసరావు



నగరం సమావేశంలో మాట్లాడుతున్న మండల శాఖ అధ్యక్షుడు రాము

అంబాజీపేట: పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా విప్పర్తి వేణుగోపాలరావు ఈ నెల 22 (సోమవారం) పి.గన్నవరం ఎన్నికల కార్యాలయంలో నామినేషన్ వేయనున్నారని పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు చెల్లుబోయిన శ్రీనివాసరావు, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పీకే రావు, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి నేలపూడి స్టాలిన్‌బాబు తెలిపారు. గంగలకుర్రు అగ్రహారంలో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్ ఆధ్వర్యంలో శనివారం పార్టీ మండల సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షుడు శేఖర్ మాట్లాడుతూ సోమవారం ఉదయం 8 గంటలకు గంగలకుర్రు మలుపు శేఖర్ ఇంటి వద్ద నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బైక్ ర్యాలీగా తరలి వెళ్లనున్నామన్నారు. ర్యాలీని ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా అందరూ సహకరించాలన్నారు.

మామిడికుదురు: ఈ నెల 22వ తేదీ సోమవారం పి.గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గం వైఎస్సార్ సీపీ అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు నామినేషన్ దాఖలు చేస్తున్నారని, ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు భారీగా తరలిరావాలని మండల శాఖ అధ్యక్షుడు కొమ్ముల రాము కోరారు. నగరం గ్రామంలో నీతిపూడి గణేష్‌బాబు ఆధ్వర్యంలో శనివారం పార్టీ కార్యకర్తల సమావేశం జరిగింది. పాశర్లపూడి గ్రామంలోని పెట్రోల్ బంక్ వద్ద నుంచి సోమవారం ఉదయం 8 గంటలకు పార్టీ శ్రేణులు భారీ ర్యాలీగా నామినేషన్ కార్యక్రమానికి బయలుదేరతారని రాము తెలిపారు.

వేంకటేశ్వరుని ఆలయానికి పోటెత్తిన భక్తులు



స్వామికి కల్యాణం నిర్వహిస్తున్న రాధాకృష్ణ-సత్యవతి దంపతులు

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన అలిమేలు మంగ, పద్మావతి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి దర్శనం కోసం శనివారం భక్తులు పోటెత్తారు. స్వామికి ఆలయ వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారుజామున తోమాల సేవ, అర్చన, నైవేద్యం, నక్షత్ర హారతి, కుంభ హారతి వంటి విశేష పూజలు చేశారు. వేదపండితుల స్వామికి తులసి పూజలు చేశారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఈ సందర్భంగా భారీ అన్నదానం ఏర్పాటు చేశారు.

వైభవంగా వేంకటేశ్వరుని కల్యాణం

అయినవిల్లి: మండలంలోని ఎస్.పెదపాలెంలో కొలువైన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం శుక్రవారం రాత్రి అత్యంత వైభవంగా జరిపారు. ఆలయ అర్చకులు, వేదపండితులు ఆధ్వర్యంలో స్వామికి విశేష పూజలు జరిపారు. గ్రామస్తులు రాయుడు రాధాకృష్ణ-సత్యవతి దంపతులు స్వామి వారి కల్యాణోత్సవాన్ని దగ్గరుండి నిర్వహించారు.

ఆలమూరులో..

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాలు శనివారం భక్తుల తాకిడి అధికమైంది. పలు గ్రామాల్లోని ఆలయాల ఆవరణలో భక్తులు గోవింద నామస్మరణతో ప్రదక్షిణలు చేస్తూ భక్త పారవశ్యం చెందారు. ఆయా దేవాలయాల ఆలయ పురోహితులు వేద మంత్రోచ్చారణల మధ్య భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఆయా ఆలయాల్లో దేవతామూర్తుల విగ్రహాలను పూల, తులసి మాలలతో అలంకరించిన తీరు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. గోశాలల్లో గోమాతలకు భక్తులు ప్రదక్షిణలు చేశారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమం సాధ్యం



గుడిమూలలో మేము సిద్ధం, మా బూత్ సిద్ధం కార్యక్రమంలో కిట్లు ఇస్తున్న శ్రీహరి రాజు

సఖినేటిపల్లి: ఎన్నికల్లో సీఎంగా తిరిగి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అధికారంలోకి తెచ్చుకుంటేనే పేదల సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగుతాయన్న విషయాన్ని ప్రజలకు చాటి చెప్పాలని జేసీఎస్ మండల ఇన్‌చార్జి నల్లి మోహన్ అన్నారు. శనివారం గుడిమూలలో పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు కోన ప్రభాకర్‌రావు అధ్యక్షతన సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, బూత్ కోర్ కమిటీ సభ్యులతో మేము సిద్ధం, మా బూత్ సిద్ధం పేరుతో సమావేశం జరిగింది. సిద్ధం కిట్లను సర్పంచ్ దెందుకూరి శ్రీహరిరాజు వారికి పంపిణీ చేశారు. అనంతరం మోహన్ మాట్లాడుతూ, బూత్‌లలో ఓటింగ్ శాతం పెంచుకునేలా ముందస్తున్న ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. అలాగే అటు ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావుకు, ఇటు ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావుకు ఫ్యాను గుర్తులపై రెండు ఓట్లు ఓటర్లు వేసేలా తగిన కృషి చేయాలని కోరారు. పీఏసీఎస్ చైర్మన్ డాక్టర్ ఆర్.పద్మరాజు, తాడి సహదేవ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



చింతలూరులోని ఎంపీపీ పాఠశాలలో జరిగిన గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

ఆలమూరు: మండలంలోని చింతలూరులోని ఎంపీపీ ప్రాథమిక పాఠశాలలో గురువారం వార్షికోత్సవ వేడుకలు జరిగాయి. ప్రధానోపాధ్యాయుడు ఉడతా వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయుడు వాసా దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎంఈఓలు పి.షాలెంరాజు, ఎస్వీ సుబ్బరాజు, సీఆర్‌పీ యడ్ల అపర్ణ విచ్చేసి వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. యూకేజీ పూర్తి చేసి ప్రథమ తరగతికి వెళుతున్న విద్యార్థులకు అధ్యాపక బృంద సభ్యులు గ్రాడ్యుయేషన్ దుస్తులను ధరింపజేసి పట్టాను, పతకాలను అందజేసి గ్రాడ్యుయేషన్ డేను నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక, వినోద, నృత్య ప్రదర్శన కార్యక్రమాలు విద్యార్థులను అలరించాయి. ప్రభుత్వ పాఠశాలలో అత్యంత వ్యయ ప్రయాసలకోర్చి వార్షికోత్సవ వేడుకలను నిర్వహించిన పాఠశాల ఉపాధ్యాయులను గ్రామస్తులు అభినందించారు.

రాష్ట్రంలో మరోసారి జగన్ ప్రభంజనం



మాగంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు

అయినవిల్లి: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభంజనం రానుందని, కూటమికి రాష్ట్రంలో కుంగుబాటు తప్పదని పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు అన్నారు. శనివారం మండలంలోని మాగంలో ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామస్తులు ఎమ్మెల్యే అభ్యర్థి వేణుగోపాలరావుకు పూలమాలలతో స్వాగతం పలికి హారతులు పట్టారు. తమ రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపిస్తామని అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని వేణుగోపాలరావుకు గ్రామస్తులు హామీ ఇచ్చారు. సీఎం జగన్ హయాంలో తాము ఎన్నో సంక్షేమ పథకాలను అందుకున్నామని అందుకు కృతజ్ఞతగా మరోసారి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపిస్తామన్నారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యపడుతోందన్నారు. కార్యక్రమంలో పార్టీ అయినవిల్లి మండల శాఖ అధ్యక్షుడు కుడుపూడి విద్యాసాగర్, ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, సర్పంచ్ కాశి వీవీ సత్యనారాయణమూర్తి, మాగం పీఏసీఎస్ అధ్యక్షుడు వేటుకూరి సుబ్బరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు మట్టపర్తి వెంకటరమణ, వాసంశెట్టి తాతాజీ, పేరిచర్ల రఘురామరాజు, గుమ్మడి ప్రసాద్, కుసుమ లిల్లీ మంగేష్కర్, మిండగుదిటి చిన్ని తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి భారీ చేరికలు



వైఎస్సార్ సీపీలో చేరిన నాయకులకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

ఆలమూరు: మండలంలోని చెముడులంకకు చెందిన జనసేన పార్టీ నేతలు భారీ సంఖ్యలో శనివారం వైఎస్సార్ సీపీలో చేరారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన జనసేన పార్టీకి చెందిన పలువురు కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి నివాసానికి ర్యాలీగా తరలివెళ్లారు. ఆ నాయకులందరికీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. సీఎం జగన్ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరిన వారందరికి సముచిత స్థానం కల్పిస్తానని హామీ ఇచ్చారు. పార్టీలో చేరిన వారిలో నాగిరెడ్డి వెంకటేశ్వరరావు, అడబాల నాగేశ్వరరావు, అడబాల పవన్, మేడిశెట్టి సుబ్రహ్మణ్యం, దొడ్డిపట్ల వెంకన్న తదితరులు ఉన్నారు. సీఎం జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని నమ్మి తాము వైఎస్సార్ సీపీలో చేరినట్లు వారు తెలిపారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డిని నాలుగోసారి భారీ మెజారిటీతో గెలిపించుకుని సీఎం జగన్‌కు కానుకగా ఇస్తామని పేర్కొన్నారు.

బడుగు బలహీన వర్గాల సీఎం జగన్

శివకోడులో జనసేన నుంచి వైఎస్సార్ సీపీలో చేరికలు



శివకోడులో వైఎస్సార్ సీపీలో చేరిన కందికట్ల గ్రూపు కాలనీ వాసులు

రాజోలు: బడుగు, బలహీన వర్గాల ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కీర్తి గడించారని రాజోలు అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. శనివారం శివకోడు కందికట్ల వారి గ్రూపునకు చెందిన జనసేన పార్టీలకు చెందిన పలువురు వైఎస్సార్ సీపీలో చేరారు. ఎస్సీ సెల్ నాయకుడు చింతా ప్రసాద్ ఆధ్వర్యంలో చేరికలు జరిగాయి. వైఎస్సార్ సీపీలో చేరిన వారికి గొల్లపల్లి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. గొల్లపల్లి సూర్యారావు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో సీఎంగా మళ్లీ జగన్ మోహన్‌రెడ్డిని విజయపథంలో నిలపాలన్నారు. సామాజిక న్యాయంతో అనేక అణగారిన వర్గాలకు రాజకీయంగా పెద్దపీట వేశారన్నారు. అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి ఆర్థిక తోడ్పాటు అందించారన్నారు. అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావు, రాజోలు అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావుల గెలిపించుకునేందుకు కందికట్ల గ్రూపు వాసులు మద్దతు ప్రకటించారు. సర్పంచ్ నక్కా రామారావు, మాజీ ఎంపీపీ పాలపర్తి ధనలక్ష్మి, గ్రామశాఖ అధ్యక్షుడు పితాని నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామా



మూలస్థాన అగ్రహారంలో రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శికి అందజేస్తున్న వలంటీర్లు

ఆలమూరు: పేదలకు అందిస్తున్న సేవలకు వక్రభాష్యం చెబుతున్న ప్రతిపక్ష పార్టీల నిరంకుశ వైఖరిని నిరసిస్తూ మండలంలోని మూలస్థాన అగ్రహారం గ్రామ సచివాలయాల పరిధిలోని 43 మంది గ్రామ వలంటీర్లు శనివారం మూకుమ్మడి రాజీనామా చేశారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద వారు విలేకరులతో మాట్లాడుతూ రాజీనామాకు దారితీసిన సంఘటనలను వారు వివరించారు. దేశ వ్యాప్తంగా వలంటీర్ వ్యవస్థపై ప్రశంసలు లభిస్తుంటే రాష్ట్రంలో మాత్రం బురద జల్లుతున్నారని దుయ్యబట్టారు. అందుకే గ్రామంలోని రెండు సచివాలయాల పరిధిలోని గ్రామ వలంటీర్లు అందరూ మూకుమ్మడి రాజీనామా చేశామన్నారు. ఈమేరకు రాజీనామా ప్రతులను గ్రామ పంచాయతీ కార్యదర్శి పాలింగి రాజుకు అందజేశారు. రాష్ట్రంలో మళ్లీ వైఎస్ జగన్‌ను సీఎంగాను, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డిని ఎమ్మెల్యేగాను మరోసారి గెలిపించుకుని సంక్షేమ రాజ్యాన్ని తీసుకువస్తామని ధీమా వ్యక్తం చేశారు.

రేపు గొల్లపల్లి నామినేషన్

మలికిపురం: రాజోలు నియోజకవర్గం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గొల్లపల్లి సూర్యారావు ఈ నెల 22వ తేదీ సోమవారం రాజోలులో నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటనల విడుదల చేశారు. సోమవారం ఉదయం 9 గంటలకు మలికిపురంలోని పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా సాగి రాజోలు చేరుకుంటారు. ర్యాలీలో పాల్గొన్న వాహనాలకు శివకోడు గంగయ్య కల్యాణ మండపం ఎదుట పార్కింగ్ ఏర్పాటు చేశారు. కార్యకర్తలకు మధ్యాహ్నం భోజనాలు కూడా అక్కడే ఏర్పాటు చేసినట్లు సూర్యారావు తెలిపారు. కార్యకర్తలంగా హాజరు కావాలని కోరారు.

రెండు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం

మామిడికుదురు: పి.గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గం జనసేన అభ్యర్థి గిడ్డి సత్యనారాయణ శనివారం బి.దొడ్డవరం, పెదపట్నంలంక గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రచార రథంపై నిల్చుని ప్రజలకు అభివాదం చేస్తూ ఓట్లు అభ్యర్థించారు. జనసేన అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనకు అండగా నిలవాలని కోరారు. జెడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, పార్టీ మండల శాఖ అధ్యక్షులు మొల్లేటి శ్రీనివాస్, జాలెం శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

ఇండిపెండెంట్‌గా మాకే నామినేషన్

పి.గన్నవరం: పి.గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి మూడో రోజైన శనివారం ఇండిపెండెంట్ అభ్యర్థిగా మాకే దేవి ప్రసాద్ రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. ఈ స్థానానికి ఇప్పటి వరకూ దేవీ ప్రసాద్ మాత్రమే నామినేషన్ వేశారు.

ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ



పెదపళ్ల ఆయుష్మాన్ భారత్ మందిరంలో ఆకస్మిక తనిఖీ చేస్తున్న టాస్క్‌ఫోర్స్ బృందం

ఆలమూరు: మండలంలోని పెదపళ్లలోని ఆయుష్మాన్ భారత్ మందిరాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. జిల్లా టాస్క్‌ఫోర్స్ ప్రత్యేక అధికారి కె.వీరబాబు ఆధ్వర్యంలో అధికారుల బృందం శనివారం విచ్చేసి రికార్డులను పరిశీలించి క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. చిన్నారులకు సకాలానికి అందించవలసిన టీకాలు, గర్భిణులు, బాలింతలలో రక్తహీనత నివారణకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు.

108 పల్లకీలతో నేడు శ్రీరామ చైతన్యయాత్ర

మలికిపురం: శ్రీరామనవమి జరిగిన తరువాత మండలంలో ప్రతి సంవత్సరం 108 పల్లకీలతో శ్రీరామ చైతన్య యాత్రను కొనసాగించబడుతుంది. ఇందులో భాగంగా మలికిపురం మండలం గూడపల్లిలో ఈ సంవత్సరం పల్లకి కార్యక్రమం ఆదివారం మధ్యాహ్నం ఒంటిగంటకు గూడపల్లిలో సుందరి వారి మెరక రామాలయం నుంచి నూకాలమ్మ ఆలయం వరకు శ్రీరామ చైతన్య యాత్ర జరుగుతుందని సుందర బ్రహ్మయ్య తెలిపారు. కావున భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని కార్యనిర్వాహకులు కొల్లు శ్రీనివాసరాజు కోరారు.

జనసేన అభ్యర్థి నామినేషన్

రాజోలు: రాజోలు నియోజకవర్గ జనసేన అభ్యర్థిగా దేవ వరప్రసాద్ శనివారం నామినేషన్ దాఖలు చేశారు. మలికిపురం మండలం విశ్వేశ్వరాయపురం నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలసి ఆయన ర్యాలీగా రాజోలు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. మూడు సెట్ల నామినేషన్ పత్రాలను రాజోలు రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్‌కు అందించారు. మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా, మాజీ ఎమ్మెల్సీ రుద్రరాజు పద్మరాజు, ఎంపీపీ కేతా శ్రీనివాస్, లింగోలు పెద్దబ్బులుతో కలసి నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి సమర్పించారు.

పెమ్మాడి సేవలు చిరస్మరణీయం

పి.గన్నవరం: ఉమ్మడి ఏపీ అగ్నికుల క్షత్రియ సంక్షేమ సంఘం మాజీ కార్యదర్శి పెమ్మాడి సుబ్బరాజు వర్ధంతిని పి.గన్నవరం అక్విడెక్టు పార్కులో నియోజకవర్గ సంఘ అధ్యక్షుడు శేరు శ్రీనుబాబు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా సుబ్బరాజు, అంతర్వేది ఆలయ నిర్మాత కొపనాతి కృష్ణమ్మ విగ్రహాలకు నాయకులు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. సుబ్బరాజు అందించిన సేవలను నాయకులు కొనియాడారు.

స్ట్రాంగ్‌రూమ్‌కు చేరుకున్న ఈవీఎంలు

యానాం: పుదుచ్చేరి లోక్‌సభ స్థానానికి శుక్రవారం జరిగిన పోలింగ్‌కు సంబంధించి ఈవీఎంలన్నీ స్ట్రాంగ్ రూమ్‌లకు శుక్రవారం అర్ధరాత్రి చేరుకున్నాయి. యానాం నియోజకవర్గంలో రాజకీయ పార్టీల సమక్షంలో ఈవీఎంలను భద్రపరిచే ప్రక్రియ శనివారం తెల్లవారుజాము వరకూ కొనసాగిందని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి మునిస్వామి తెలిపారు. పుదుచ్చేరి లోక్‌సభ స్థానంలో యానాం, మాహే, పుదుచ్చేరి, కారైకల్ రీజియన్లలోని 967 పోలింగ్ బూత్‌ల్లో 2,587 ఈవీఎంలు, 1,254 కంట్రోల్ యూనిట్లు, 1,324 వీవీ ప్యాట్లను ఉపయోగించారు. అనంతరం వాటిని ఆయా నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌ల్లో భద్రపరిచారు. యానాంలో స్థానిక ఎస్ఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఈవీఎంలను భద్రపరిచారు.